క్లుప్తంగా

చిన్నారి కావ్యకు పర్యావరణ పురస్కారం


పర్యావరణ పురస్కారంతో కావ్యను సత్కరిస్తున్న నిర్వాహకులు

అమలాపురం టౌన్: విజయవాడలో జరుగుతున్న ప్రపంచ తెలుగు సదస్సు కవి సమ్మేళనంలో అమలాపురానికి చెందిన చిన్నారి కవి ఎస్. కావ్య పర్యావరణ పరిరక్షణపై కవితా గానాన్ని వినిపించింది. 'చెట్టు విలువ ఎంతని చెప్పను' అనే అంశంపై కావ్య ఆలపించిన కవితా గానం ఆలోచింపజేసింది. తెలుగు సదస్సు నిర్వాహకులు చిన్నారి కవి కావ్యకు 'పర్యావరణ కవయిత్రి; అనే పురస్కారాన్ని అందించి సత్కరించారు. కావ్యతో పాటు ఆమె తండ్రి కవి, తెలుగు అధ్యాపకుడు ఎస్.సంసోను సైతం ఇదే తెలుగు సదస్సులో పాల్గొని కవితా గానాన్ని వినిపించారు.

విద్యుత్ మోటార్ల చోరీ

అల్లవరం: స్థానిక హైస్కూల్ ఎదురుగా ఇళ్ల అర్జునరావు నిర్వహిస్తున్న వెల్డింగ్ షాపులో శనివారం రాత్రి రెండు విద్యుత్ మోటార్లు చోరీకి గురయ్యాయి. గోడిలంకకు చెందిన ఆక్వా రైతు వెల్డింగ్ షాపు నిర్వాహకుడికి బెడ్లు తయారు చేయడానికి గాను శనివారం 2 హెచ్‌పీ మోటార్లను ఇచ్చారు. రాత్రి పని ముగించుకున్న అర్జునరావు షాపుకు తాళాలు వేసి ఇంటికి వెళ్లారు. ఆదివారం ఉదయం షాపుకి వచ్చి చూసే సరికి షాపు తాళాలు తెరిచి ఉండడంతో పాటు అందులోని మోటార్లు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ ఘటనపై అర్జునరావు అల్లవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

కథల పోటీల్లో విద్యార్థిని ప్రతిభ


మీనాక్షికి అవార్డు అందిస్తున్న నిర్వాహకులు

అల్లవరం: కాకినాడ జేఎన్‌టీయూలో జరిగిన రాష్ట్ర స్థాయి కథల పోటీల్లో అమలాపురం రూరల్ ఇందుపల్లి బొంతువారిపేటకు చెందిన శ్రీపాద మీనాక్షి కౌస్తుభ తృతీయ స్థానం సాధించింది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి 250 మంది విద్యార్థులు పోటీల్లో వారి ప్రతిభను చాటారు. లోక్‌సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ, విద్యావేత్త, రచయిత సీవీ ప్రసాద్ ఆధ్వర్యంలో మీనాక్షికి అవార్డును అందించారు. పాఠశాల హెచ్‌ఎం ఆకెళ్ల బుజ్జి, ఎంఈఓ సూర్యప్రకాశం తదితరులు విద్యార్థినిని అభినందించారు.

వాకింగ్ ట్రాక్‌పై గడ్డి తొలగింపు


వాకింగ్ ట్రాక్‌పై గడ్డి తొలగింపు పనిని పర్యవేక్షిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటేష్

అమలాపురం టౌన్: స్థానిక 8వ వార్డులోని గరిగుంట చెరువు ఉద్యానవనం అభివృద్ధిలో భాగంగా వాకింగ్ ట్రాక్ చుట్టూ గడ్డిపెరిగి పోవడంతో ఆ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ వైస్ చైర్మన్ తిక్కిరెడ్డి వెంకటేష్ తన సొంత ఖర్చుతో ఆదివారం శుభ్రం చేయించారు. వాకింగ్ ట్రాక్ చుట్టూ పెరిగిపెయిన గడ్డిపై క్రిమి సంహారక మందులతో పిచికారీ చేయించారు. మున్సిపల్ అధికారులకు పెరిగిపోయిన గడ్డిని తొలగించమని విన్నవించుకున్నా వారు పట్టించుకోకపోవడంతో వైస్ చైర్మన్ సొంత డబ్బులతో ఈ పనులు చేపట్టారు. మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటేష్, వార్డు నాయకుడు చిక్కం కిట్టు పర్యవేక్షించారు.

సూరేశ్వరస్వామి ఆలయంలో పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

ముమ్మిడివరం: ధనుర్మాసం, మాస శివరాత్రి ఆదివారం పురస్కరించుకొని ముమ్మిడివరం శ్రీ ఉమా సూరేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య స్థాపన, రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజ, రుద్రహోమం, సూర్య నమస్కారాలు, నవగ్రహ అర్చన తదితర పూజలు చేశారు. అనంతరం అన్న సమారాధన జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ఏలికా.. భారమోపలేకున్నా..!

- నన్ను బాగు చేయండి లేదా ప్రత్యామ్నాయం చూడండి
- నాపై రోజురోజుకూ ట్రాఫిక్ ఒత్తిడి పెరుగుతోంది
- సత్తువ తగ్గి శిథిలావస్థకు చేరుకుంటున్నాను
- సేవలకు సెలవంటూ నేను కూలిపోతే జరిగే నష్టానికి నన్ను బాధ్యుడ్ని చేయకండి
- ఈదరపల్లి వంతెన మనోవేదన


ఈదరపల్లి వంతెన ఫుట్‌పాత్‌కు ఏర్పడ్డ భారీ రంధ్రాల్లో నుంచి కనిపిస్తున్న పంట కాలువ నీరు


బాటసారులు నడిచే మార్గం దుస్థితి


వంతెనపై నిలిచిన ట్రాఫిక్(ఫైల్)

'నాపై అనుదినం ట్రాఫిక్ ఒత్తిడి పెరుగుతోంది. రోజూ ఏదో సమయంలో ట్రాఫిక్ స్తంభించిపోయినప్పుడు నాపై ఆ భారం మరింత పడుతోంది. నాలో సత్తువ సన్నగిల్లుతోంది. నన్ను దాదాపు 60 ఏళ్ల కిందట నిర్మించారు. నా పై నుంచి రోజుకు మూడు వేలకు పైగా వాహనాలు వెళుతున్నాయి. ఫుట్‌పాత్ పూర్తిగా శిథిలమై పెద్ద పెద్ద రంధ్రాలు పడ్డాయి. ఆ రంధ్రాల్లోంచి నా కింద పారుతున్న పంట కాలువలోని నీరు కనిపిస్తుంది. వంతెన రెయిలింగ్ దెబ్బతింది. ఫుట్‌పాత్‌పై నుంచి బాటసారులు నడిచి వెళ్లే పరిస్థితి ఎప్పటి నుంచో దూరమైంది. ఇలా నిత్యం నిలబడి ట్రాఫిక్ భారాన్ని భరిస్తున్నాను. ఉన్న కొద్దిపాటి సత్తువతో అలానే సేవలు అందిస్తున్నాను.' అమలాపురం పట్టణ ప్రవేశ ద్వారమైన ఈదరపల్లి వద్ద మెయిన్ రోడ్డుపై ఉన్న వంతెన మనో వేదన ఇది.

అన్ని వాహనాలు నాపై నుంచే..

హైదరాబాద్, విజయవాడ, రాజమహేంద్రవరం, రావులపాలెం, రాజోలు దీవి నుంచి వచ్చే అన్ని వాహనాలు నాపై నుంచే పట్టణంలోకి అడుగు పెడతాయి. హైటెక్ బస్సులు, చమురు సంస్థల భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు, లారీలు, ట్రాక్టర్లు, కార్లు, ద్విచక్ర వాహనాలు ఇలా నాపై నుంచి రోజూ వెళ్లడంతో సత్తువ తగ్గుతున్న నేను ట్రాఫిక్ ఒత్తిడితో అలసి సొలసి పోతున్నాను. అమలాపురం నల్ల వంతెన, ఎర్ర వంతెనలకు ట్రాఫిక్ ఒత్తిడి ఉన్నా నా అంత ఒత్తిడి ఉండదు. ఎందుకంటే నా (ఈదరపల్లి వంతెన) మీదుగా మెయిన్ రోడ్డు, అలాగే నా పక్క నుంచి ఈదరపల్లి- ముక్కామల బైపాస్ రోడ్డు, మరో పక్క నుంచి పట్టణ బైపాస్ రోడ్డు, ఇంకో వైపు నుంచి ఈదరపల్లి -ఇందుపల్లి రోడ్డు.. ఇలా నాలుగు వైపుల నుంచి వచ్చి పోయే వాహనాలతో రోజూ నేను ఉక్కిరి బిక్కిరి అవుతున్నాను.

బాగు చేయండి లేదా ప్రత్యామ్నాయం చూడండి

'శిథిలావస్థకు చేరుకుంటున్న నన్ను బాగు (రిపేరు) చేయండి లేదా నా పక్కనే ప్రత్యామ్నాయంగా మరో వంతెన నిర్మించండి. అప్పుడు నాపై ట్రాఫిక్ ఒత్తిడి కొంత తగ్గి నేను మరి కొంత కాలం మీకు సేవలు అందించే వంతెన అవుతాను. అమలాపురానికి మాస్టర్‌ప్లాన్ ఆమోదమైందని తెలిసింది. ఆ అభివృద్ధిలో భాగంగా నాకూ మంచి రోజులు వస్తాయని ఆశ పడుతున్నాను. మరో పక్క స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి 7 వంతెనలు నిర్మించనున్నట్లు హామీలు ఇస్తున్నారు. 7 వంతెనలు తర్వాత నిర్మించుకోవచ్చు. ముందు నా సంగతి చూడమనండి. అత్యవసరంగా నాకు మరమ్మతులైనా చేయించండి. లేదా నాకు పక్కన మరో వంతెన నిర్మిస్తే ఇన్, అవుట్ వాహనాల రాకపోకలతో నాపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గుతుందన్నది నా ఆశ. నన్ను అలానే నిర్లక్ష్యంగా వదిలేస్తే ఏదో రోజు నా సత్తువ పూర్తిగా తగ్గిపోతుంది. సేవలకు సెలవంటూ నేను కూలిపోతే జరిగే కష్ట నష్టాలకు మాత్రం దయచేసి నన్ను బాధ్యుడ్ని చేయకండి. రెండు చేతులు జోడించి నమస్కరిస్తున్నాను. ముందు నా పునర్నిర్మాణం సంగతి చూడండి లేదా ప్రత్యామ్నాయ ప్రయత్నమైనా చేయండి.' అంటూ ప్రజా ప్రతినిధులను ఈదరపల్లి వంతెన వేడుకుంటోంది.

– అమలాపురం టౌన్

వీఆర్వోలకు పదోన్నతి కల్పించాలి


సంఘ అధ్యక్ష, కార్యదర్శులకు వినతిపత్రం అందిస్తున్న వెంకట గణేష్

అమలాపురం రూరల్: గ్రేడ్ 1, 2 వీఆర్వోలకు కామన్ డీడీఓగా తహసీల్దార్ ఉండాలని, బయోమెట్రిక్ అటెండెన్స్‌ను యాప్ ద్వారా అమలు చేయాలని ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు భూపతిరాజు రవీంద్రరాజు, అప్పలనాయుడులను అంబేడ్కర్ కోనసీమ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటగణేష్ కోరారు. గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ సమావేశం విజయవాడలోని గాంధీనగర్ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ పదేళ్లుగా ప్రమోషన్ల కోసం ఎదురు చూస్తున్న గ్రేడ్-1 వీఆర్వోలకు సీనియర్ అసిస్టెంట్లుగా, ఆర్ఐలుగా వన్ టైం మేజర్ కింద పదోన్నతులు కల్పించాలని కోరారు. జీవో నెంబర్ 164 ప్రకారం గ్రేడ్-2 వీఆర్వోలకు గ్రేడ్-1 వీఆర్వోలుగా పదోన్నతులు ఇవ్వాలని అభ్యర్థించారు. వీఆర్వోలకు ప్రత్యేక కార్యాలయాలు, కంప్యూటర్ సౌకర్యం, పని ఒత్తిడి దృష్ట్యా వీరికి సహాయకులుగా వీఆర్ఏ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. మహిళా వీఆర్వోలకు నిర్ణీత పని వేళలను అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో కొత్తపేట డివిజన్ కార్యదర్శి కోరుకొండ శ్రీనివాసరావు, మాచిరాజు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ


నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న, మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్, సంఘ ప్రతినిధులు

అమలాపురం టౌన్: పట్టణ అగ్ని కుల క్షత్రియ మిత్ర సంఘం 2025 నూతన సంవత్సరానికి ముద్రించిన క్యాలెండర్‌ను ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో ఆదివారం ఆవిష్కరించారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని పొన్నాడ ఇంట్లో సంఘం అధ్యక్షుడు కొల్లు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ మాట్లాడుతూ అగ్నికుల క్షత్రియులు ఐక్యతతో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం సతీష్‌కుమార్‌ను సంఘం తరఫున సత్కరించారు. పట్టణంలోని శ్రీరామ హాస్పిటల్‌లో డాక్టర్ కొల్లు శ్రీనుబాబు చేతుల మీదుగా క్యాలెండర్లు విడుదల చేశారు. ఈ కార్యక్రమాల్లో అగ్ని కుల క్షత్రియ మైత్రీ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

వాకర్స్ అంతర్జాతీయ ఉపాధ్యక్షునిగా ప్రొఫెసర్ నాగేంద్ర


ప్రొఫెసర్ నాగేంద్ర, నాగేశ్వరరావులను అభినందిస్తున్న వాకర్స్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: వాకర్స్ అంతర్జాతీయ ఉపాధ్యక్షునిగా అమలాపురానికి చెందిన ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రం ఏలూరులో ఆదివారం జరిగిన వాకర్స్ అంతర్జాతీయ కన్వెన్షన్‌లో ప్రొఫెసర్ నాగేంద్ర ఉపాధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికై ప్రమాణ స్వీకారం చేశారు. ఇదే వేదికపై అమలాపురానికి చెందిన సీనియర్ వాకర్ సప్పా నాగేశ్వరరావు జిల్లా వాకర్స్ గవర్నర్‌గా ఎన్నికయ్యారు. ప్రొఫెసర్ నాగేంద్ర, నాగేశ్వరరావుల చేత వాకర్స్ అంతర్జాతీయ అధ్యక్షుడు ఎం.మురళీ మోహనరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఇదే కన్వెన్షన్‌లో పాల్గొన్న అమలాపురానికి చెందిన వాకర్స్ అంతర్జాతీయ మాజీ అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ శర్మ, అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రాద్, క్లబ్ మాజీ అధ్యక్షుడు వైఎస్సార్ మూర్తి, పట్నాల రమణ తదితరులు ప్రొఫెసర్ నాగేంద్ర, నాగేశ్వరరావులను అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

అమలాపురం టౌన్: స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్న యువకుడి దుర్మరణానికి సంబంధించిన వీడియో ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ వీడియో దృశ్యాలు పలు రకాల అనుమానాలకు తావిస్తోంది. అయితే కుటుంబ సభ్యులు మాత్రం తమకు ఎవరి మీదా అనుమానం లేదని, భవనంపై నుంచి పడిపోయి మృతి చెందినట్లు చెబుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. పట్టణానికి చెందిన ఆ యువకుడు హౌసింగ్ బోర్డు కాలనీలోని ఓ ఇంటి నిర్మాణంలో చేస్తున్నాడు. పది రోజుల కిందట రాత్రి భవనంపై నుంచి పడిపోవడం వల్ల ఆ యువకుడు దుర్మరణం చెందాడు. యువకుడి మృతి సమాచారంతో సంఘటనా స్థలానికి పోలీసులు రావడంతో పాటు మృతికి సంబంధించిన వీడియోను చూశారు. అనుమానం వచ్చి మృతుడి కుటుంబీకులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారించారు. భవనంపై నుంచి ప్రమాదవశాత్తు పడిపోయి మృతి చెందాడని, తమకు ఎవరిపైనా అనుమానాలు లేవని, ఈ విషయంలో ఫిర్యాదు ఇవ్వబోమని పోలీసులకు మృతుడి కుటుంబీకులు స్పష్టం చేశారని తెలిసింది. అయితే వెలుగు చూసిన వీడియోలో దుర్మరణం చెందిన యువకుడు రక్తపు మడుగులో ఉన్నట్లు, మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యాలు కనిపించాయి. ఈ వీడియోను వీక్షించిన ప్రజలు మాత్రం ఇది హత్యా లేదా ప్రమాదమా...? అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. యువకుడి మృతిపై పట్టణ సీఐ పి.వీరబాబును వివరణ కోరగా యువకుడి మృతికి సంబంధించిన వీడియో తాము కూడా చూశామన్నారు. అనుమానం వచ్చి మృతుని కుటుంబీకులను పిలిపించి విచారణ చేశామన్నారు. భవనంపై నుంచి ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందాడని, తమకు ఎవరిపైనా అనుమానాలు లేవని చెప్పారని సీఐ పేర్కొన్నారు. ఆ కుటుంబీకులు ఫిర్యాదు ఇస్తే కేసు నమోదు చేసి విచారిస్తామని తెలిపారు.

కమనీయం.. సత్యదేవుని కల్యాణం


సత్యదేవుని కల్యాణంలో భక్తులకు జీలకర్ర-బెల్లాన్ని చూపిస్తున్న వేద పండితులు

అమలాపురం టౌన్: లోకా సమస్తా సుఖినోభవంతు ఆధ్యాత్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో లోక కల్యాణార్థం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి దివ్య కల్యాణం ఆదివారం ఉదయం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక సంస్థ వ్యవస్థాపకుడు, ఆధ్యాత్మిక వేత్త రేలంగి కుమార్ శంకర్ గౌడ్ పర్యవేక్షణలో స్వామి దివ్య కల్యాణం కన్నుల పండువగా సాగింది. వేలాది మంది భక్తుల సమక్షంలో వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ కల్యాణంలో జీలకర్ర-బెల్లం స్వామి, అమ్మవార్ల శిరస్సున ఉంచి శాస్త్రోక్తంగా నిర్వహించారు. తర్వాత మంగళ సూత్ర ధారణ, తలంబ్రాల ఘట్టాలు కమనీయంగా సాగాయి. దంపతుల జంటలు ఆసీనులై వారే కర్తలుగా స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని స్వయంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆధ్యాత్మిక వేత్త కుమార్ శంకర్ గౌడ్ ఆశీర్వచనాలు అందించారు. అన్నపూర్ణాదేవి ఆరాధన చేసి భారీ అన్న సమారాధన నిర్వహించారు. వేలాది మంది భక్తులు స్వామి వారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రముఖ్ డాక్టర్ గోదశి గంగరాజు, శ్రీ సత్యసాయి సేవా సంస్థల కన్వీనర్ డాక్టర్ జి.ప్రభాకర్ తదితర ధార్మిక సంస్థల ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు స్వామి కల్యాణాన్ని కనులారా వీక్షించారు.

గ్రామాల్లో డ్రోన్ కెమెరాలతో బందోబస్తు


ఉప్పలగుప్తంలో డ్రోన్ కెమెరాను ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్న ఎస్ఐ రాజేష్

ఉప్పలగుప్తం: నేర నియంత్రణలో భాగంగా ఇక నుంచి మండల పరిధిలోని గ్రామాల్లో డ్రోన్ కెమెరాతో బందోబస్తు నిర్వహిస్తున్నట్టు ఎస్ఐ సీహెచ్ రాజేష్ తెలిపారు. మండలంలోని ఉప్పలగుప్తం గ్రామంలో డ్రోన్ కెమెరాను సిబ్బందితో కలిసి ప్రయోగాత్మకంగా ఎగురవేశారు. ఇక నుంచి జన సంచారం తక్కువగా ఉన్న ప్రాంతాలపై నిఘా ఉంచేందుకు డ్రోన్ కెమెరాలను వినియోగిస్తామని ఎస్సై చెప్పారు. దీంతో నేరాలు తగ్గుముఖం పట్టేందుకు అవకాశం ఉందన్నారు.

వీరేశ్వర స్వామి నూతన క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే దాట్ల, ఆలయ సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ తదితరులు

ఐ.పోలవరం: మురమళ్ల శ్రీ వీరేశ్వరస్వామి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం ముమ్మిడివరం ఎమ్మెల్యే, ఏపీ ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు, ఆలయ సహాయ కమిషనర్, కార్యానిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణతో కలిసి ఆవిష్కరించారు. ఫిబ్రవరి 26వ తేదీన మహా శివరాత్రి సందర్భంగా స్వామివారికి నిర్వహించే ద్వాదశ పుష్కర నదీ జలాభిషేకానికి సంబంధించిన కరపత్రాన్ని సైతం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, దాట్ల ఇంద్రరాజు, దాట్ల రామకృష్ణంరాజు, అర్చకులు పేటేటి శ్యామల కుమార్, యనమండ్ర సుబ్బారావు, తేజ, పురోహితులు నాగాభట్ల రామకృష్ణ మూర్తి, స్వస్తి వాచకులు నాగాభట్ల రవి శర్మ, వేద పండితులు గంటి సుబ్రమణ్య శాస్త్రి, ఆలయ పర్యవేక్షణ అధికారి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోలోకి దూసుకుపోయిన బైకు


సుంకటరేవు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటోలోకి దూసుకుపోయిన బైక్

ఆటో డ్రైవరుకు తీవ్ర గాయాలు

తాళ్లరేవు: జాతీయ రహదారిలోని సుంకటరేవు వద్ద ఎదురుగా వస్తున్న ఆటోలోకి బైక్ దూసుకుపోవడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు యానాం నుంచి తాళ్లరేవు వైపునకు వస్తున్న ఆటో ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కొండెవరం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ నరాల కాశీ ఈశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. బైక్‌పై వస్తున్న తాళ్లరేవు జెల్లావారిపేటకి చెందిన దాసరి నూకరాజుకు సైతం గాయపడ్డాడు. ఇరువురు కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


1993-94 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

అల్లవరం: కొమరగిరిపట్నం ఉన్నత పాఠశాలలో 1993-94 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదవిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వారికి విద్య నేర్పిన గురువర్యులను ఘనంగా సన్మానించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని అలనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. అక్కడే సహపంక్తి భోజనాలు చేశారు.

కవి బీవీవీకి సేవారత్న అవార్డు


సేవారత్న అవార్డుతో కవి బీవీవీకి సత్కారం

అమలాపురం టౌన్: కవి, కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణకు మనం ఫౌండేషన్ అంతర్జాతీయ సేవా సంస్థ భారత సేవారత్న అవార్డును ప్రదానం చేసింది. హైదరాబాద్‌లోని తెలంగాణా సారస్వత పరిషత్ భవనంలో ఆదివారం రాత్రి ఆ సంస్థ అవార్డును ప్రదానం చేసి ఘనంగా సత్కరించింది. కవి బీవీవీ తన తల్లిదండ్రుల పేరు మీదుగా సామాజిక సంస్థను నెలకొల్పి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు గాను ఆయనను సేవా రత్న అవార్డుకు ఎంపిక చేసినట్లు మనం ఫౌండేషన్ అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కె.చక్రవర్తి తెలిపారు. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, కవులు మాకే బాలార్జున, సత్యనారాయణ, అరిగెల బలరామమూర్తి, నల్లా నరసింహమూర్తి తదితరులు కవి బీవీవీ అవార్డు అందుకోవడం పట్ల హర్షం వెలిబుచ్చారు.

పర్యావరణ కవి పురస్కారం అందజేత

తాళ్లరేవు: విజయవాడలో జరిగిన 6వ ప్రపంచ తెలుగు రచయితల మహా సభల్లో తాళ్లరేవుకు చెందిన పినపోతు వెంకటేశ్వరరావు పర్యావరణ కవి పురస్కారం అందుకున్నారు. ఆదివారం విజయవాడ కేబీఎన్ కళాశాలలో జరిగిన యువ రచయితల సమ్మేళనంలో పర్యావరణ అవగాహనపై కవితాగానం చేసినందుకు గానూ ప్రథమ బహుమతికి ఎంపికయ్యారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు.

ఎస్సీ వర్గీకరణపై తీర్పు అసమంజసం

అమలాపురం రూరల్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు కులాల ఐక్యతను దెబ్బతీస్తుందని ప్రముఖ విశ్లేషకుడు పీఎస్ఎన్ మూర్తి అన్నారు. కులాల ఆధారంగా ఉద్యోగాలు రావడం లేదని, కేవలం ప్రతిభ ఆధారంగానే వస్తున్నాయని తెలిపారు. అంటరానితనాన్ని చట్టపరంగా నిషేధించడం కాదని ఆ భావనను ప్రజల నుంచి తొలగించడం ప్రధానమన్నారు. ఈ సమస్యను పక్కన పెట్టి తీర్పు ఇవ్వడం సరికాదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ విధానాన్ని ముందుకు తీసుకెళ్లే విధానాన్ని మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బత్తులు నకులరాజు, గోసింగి బంగ్రాజు, ప్రబుద్ధ భారత్ పరస్పర సహకార సంఘం అధ్యక్షులు పెనుమాల చిట్టిబాబు, మల్లేశ్వరరావు, నేరేడుమిల్లి సత్యనారాయణ, భీమారావు, జల్లి శ్రీనివాస్, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా యర్రంశెట్టి


ముమ్మిడివరం వర్తక సంఘ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

ముమ్మిడివరం: చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా యర్రంశెట్టి వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఆదివారం స్థానిక వాసవీ కల్యాణ మండపంలో ముమ్మిడివరం వర్తక సంఘ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యర్రంశెట్టి వెంకటేశ్వరరావు, గౌరవాధ్యక్షుడిగా పసుమర్తి వెంకట సుబ్బరావు, సెక్రటరీగా కంచర్ల నగేష్, ట్రెజరర్‌గా అప్పన్న తాతాజీ, ఉపాధ్యక్షుడిగా నలమాటి కొండలరావు, జాయింట్ సెక్రటరీగా వెస్సా నాగుతో పాటు కార్యవర్గ సభ్యులను నియమించారు.

ఆక్వా సమస్యల పరిష్కారానికి కృషి

ఐ.పోలవరం: ఆక్వా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల బుచ్చిబాబు ఆక్వా డీలర్స్ అసోసియేషన్ సభ్యులకు హామీ ఇచ్చారు. కొమరగిరిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాల్లో ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు వివరించి సబ్సిడీపై మందులు, విద్యుత్ చార్జీలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. గతంలో కంటే ఆక్వా సాగు విపరీతంగా పెరిగిపోవడం వల్ల సక్సెస్ రేటు తక్కువగా ఉందని రైతులు ఈ కారణంగా తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఆక్వా సంఘానికి స్థలం కేటాయించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

సామాజిక కార్యకర్త బాబీకి సత్కారం


అవార్డు అందుకుంటున్న ధూళిపూడి బాబి

తాళ్లరేవు: నేత్రదానంపై అవగాహన కల్పిస్తూ ఎంతో మంది కార్నియాలను సేకరించేందుకు కృషి చేసిన పి.మల్లవరం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త ధూళిపూడి బాబీని ఆదివారం పలువురు సత్కరించారు. కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్ 18వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పద్మశ్రీ డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్, డాక్టర్ మధు ఉద్దిరాజులు బాబీకి జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైద్యురాలు దామెర్ల విజయలక్ష్మి, బాదం బాలకృష్ణ, సాయి, నానాజీ, రవి తదితరులు పాల్గొన్నారు.